# సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలి..

- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పిలుపు
- బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, ఎంఐఎం నేతలు



బీఆర్ఎస్ పార్టీలో చేరిన యువకులకు గులాబీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

జూబ్లీహిల్స్, నవంబర్18 : తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటి గడపకు తీసుకెళ్లి, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన గురుతర బాధ్యత కార్యకర్తలపై ఉందని బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ పిలుపునిచ్చారు. శనివారం యూసుఫ్‌గూడ డివిజన్ , వెంకటగిరిలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్, ఎంఐఎం పార్టీల నుంచి సుమారు 200 మంది యువకులు, మహిళలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హనుమాన్ టెంపుల్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాగంటి మాట్లాడుతూ.. అన్ని వర్గాల కోసం సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఎన్నికల కోసం ప్రవేశపెట్టిన పథకాలు కావని.. ఎల్లకాలం పేద బడుగు బలహీన వర్గాలకు అండగా ఉండే పథకాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రజల వద్దకు వచ్చే గ్యారెంటీ లేని పార్టీలు ఎన్ని గ్యారెంటీలు ఇచ్చినా అది ఎన్నికలు ముగిసే వరకేనని అన్నారు. ఎన్నికలు ముగిసిన మరుసటిరోజు వారి గ్యారెంటీలతో పాటు ఆ ముఖాలు మళ్లీ ప్రజలకు కనబడవని అన్నారు. ఈ రోజు బీఆర్ఎస్ పార్టీలో ఇంతమంది యువకులు స్వచ్ఛందంగా చేరడానికి కరోనా కష్టకాలంలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాలేనన్నారు. సొంత కుటుం బం కూడా పట్టించుకోని సమయంలో సీఎం కేసీఆర్ ప్రతి ఒక్కరి కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సంతోష్ ముదిరాజ్, కార్యదర్శి నర్సింగ్‌దాస్, బసవరాజు, లక్ష్మణ్ గౌడ్, రాము గౌడ్, ఇంతియాజ్, నాగరాజు, లడ్డూ, సాయి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌కు అదనపు ఓటింగ్ యంత్రాలు..
### స్ట్రాంగ్ రూమ్‌లకు అదనపు ఎన్నికల సామగ్రి..
### ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి : ఆర్వో రవి



జూబ్లీహిల్స్, నవంబర్ 18 : అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి 19 మంది అభ్యర్థులు పోటీ పడుతుండటంతో అధికారులు అదనంగా ఓటింగ్ యంత్రాలను సిద్ధం చేస్తున్నారు. జూబ్లీహిల్స్‌లో ఓటర్లు పెరగడంతో 329 పోలింగ్ స్టేషన్‌లకు అదనంగా మరో 6 యాక్సలరీ పోలింగ్ స్టేషన్లను పెంచారు. దీంతో పాటు 1600 మంది కంటే ఎక్కు వ ఓటర్లున్న చోట అదనపు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు 411 బ్యాలెట్ యూని ట్లు, 460 వీవీ ప్యాట్‌లు, మరో 411 కంట్రోల్ యూనిట్లు ఇప్పటికే ఇక్కడికి చేరుకోగా తాజాగా 469 బ్యాలెట్ యూనిట్లు వచ్చాయి. శుక్రవారం రాత్రి ఆయా ఎన్నికల సామగ్రిని అధికారులు యూసుఫ్‌గూడ కోట్లవిజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు.

**ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి..**

ఓటింగ్ యంత్రాల ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు జూబ్లీహిల్స్ రిటర్నింగ్ ఆఫీసర్ టి.రవి వెల్లడించారు. శనివారం బంజారాహిల్స్‌లో ఉన్న షేక్‌పేట్ తాసీల్దార్ కార్యాలయంలోని రిటర్నింగ్ ఆఫీస్‌లో అభ్యర్థుల సమక్షంలో ఆన్‌లైన్‌లో ఈ ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్నికల పరిశీలకుడు జె.జయకాంతన్ ఆధ్వర్యంలో ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికల సామగ్రిని వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో కేవీబీఆర్ స్టేడియంలోని డీఆర్‌సీ సెంటర్ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచినట్లు తెలిపారు.

## ఈవీఎంల తయారీలో జాగ్రత్తలు పాటించాలి
### యూసుఫ్‌గూడలో సెక్టోరియల్ ఆఫీసర్స్‌కు శిక్షణ..



ఈవీఎంల నిర్వహణపై సెక్టోరియల్ ఆఫీసర్స్‌కు శిక్షణ ఇస్తున్న అధికారులు

జూబ్లీహిల్స్,నవంబర్18: ఈవీఎంల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జూబ్లీహిల్స్ రిటర్నింగ్ ఆఫీసర్ టి.రవి పేర్కొన్నారు. శనివారం యూసుఫ్‌గూడ కోట్లవిజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఎన్నికల పరిశీలకుడు జె.జయకాంతన్‌తో కలిసి సెక్టోరియల్ ఆఫీసర్స్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని 32 రూట్లలోని సెక్టోరియల్ ఆఫీసర్స్ ఈవీఎంల తయారీలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 61 ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సేవా ఎస్లావత్, జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల్లో ప్రతిభా పాటవాలను వెలికితీయాలి

వెంగళరావునగర్, నవంబర్ 18 : చిన్నారుల్లో దాగిన ప్రతిభా పాటవాలను వెలికితీయాలని విజ్ఞానజ్యోతి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ అరుణకుమారి అన్నారు. శనివారం మధురానగర్‌లో పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ.. పిల్లలను చిననాటి నుంచే ప్రోత్సహిస్తే భవిష్యత్తులో మంచి విజయాలు సాధిస్తారని అన్నారు. ఈ కార్య క్రమంలో పాఠశాల అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విజ్ఞాన జ్యోతి పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్

## ‘విజయశాంతి రాజకీయ అజ్ఞాని’

ఖైరతాబాద్, నవంబర్ 18 : ప్రస్తుత కాంగ్రెస్ నాయకురాలు విజయశాంతి అహంకారపూరితమైన మాటలు మానుకోవాలని హైదరాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ప్రసన్న రామ్మూర్తి అన్నారు. రాజకీయ భిక్షపెట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని, బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని వ్యాఖ్యానించడం ఆమె అవివేకానికి నిదర్శనమన్నారు. ఎలాంటి రాజకీయ అనుభవం లేని విజయశాంతికి నాటి టీఆర్ఎస్‌లో అవకాశం కల్పించడంతో పాటు పదవులు కూడా ఇచ్చారన్నారు. అలాంటి వ్యక్తిపై నోటికొచ్చినట్లు మాట్లాడాన్ని మానుకోవాలని, విజయశాంతి వెంటనే బీఆర్ఎస్, సీఎం కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కోరారు.

## హైదరాబాద్ ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభం

బంజారాహిల్స్: నోరూరించే వంటకాలతో బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని ఏఎన్ ప్యాలెస్‌లో 'హైదరాబాద్ ఫుడ్ ఫెస్టివల్' శనివారం ప్రారంభమైంది. నిజామీ రుచులను ఇష్టపడేవారి కోసం విభిన్నమైన వంటకాలు అందించేందుకు ఈ ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. బిర్యానీ, ధమ్‌కా చికెన్, హలీమ్‌లతో సహా 28 వంటకాలు ఈ ఫుడ్ ఫెస్టివల్‌లో నెలరోజుల పాటు అందుబాటులో ఉంచనున్నామని ఏఎన్ రెస్టారెంట్స్ ఎండీ జాన్వీ నారంగ్ తెలిపారు.



## కౌమార బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

కౌమార బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని ఏహెచ్ఏహెచ్ ఐఏపీ చైర్ పర్సన్, యువ స్టేట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నోడల్ అధికారి డాక్టర్ రమేశ్ దంపూరి పేర్కొన్నారు. శనివారం నగరంలోని నారాయణగూడ మాడపాటి హనుమంతరావు పాఠశాలలో స్వశోధన్ ట్రస్ట్ సౌజన్యంతో బాలికల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది బాలికలతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

*– జూబ్లీహిల్స్, నవంబర్ 18*

## 26న కార్తీక వనభోజన మహోత్సవం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గ్రేటర్ రాయలసీమ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ హనుమంత్‌రెడ్డి, తదితరులు

బంజారాహిల్స్,నవంబర్ 18: గ్రేటర్ రాయలసీమ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఈనెల 26న కార్తీక వనభోజన మహోత్సవాన్ని మియాపూర్‌లోని నరేన్ గార్డెన్స్‌లో నిర్వహించనున్నామని అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐఏఎస్ అధికారి హనుమంతరెడ్డి తెలిపారు. పంజాగుట్టలోని అసోసియేషన్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హనుమంతరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా హైదరాబాద్‌లో స్థిరపడిన రాయలసీమ వాసులందరూ ఎంతో సంతోషంగా జీవిస్తున్నారని, వారందరినీ ఒకతాటిపైకి తీసుకువచ్చి రాయలసీమ సాంస్కృతిక వారసత్వాన్ని గురించి వివరించడం కోసం తమ అసోసియేషన్ పనిచేస్తోందన్నారు. దీనిలో భాగంగా కార్తీక వన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా కార్తీక వనభోజన మహోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రాఘువ, సుబ్బారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మధుసూదన్ చౌదరి, రఘునాథరెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బద్రీనాథ్ పాల్గొన్నారు.

### బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సుకు
## దరఖాస్తుల ఆహ్వానం
### ఏకేఎస్ వర్సిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ సాంబశివ యాదవ్

ఖైరతాబాద్, నవంబర్ 18 : బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సులో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఏకేఎస్ యూనివర్సిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ సాంబశివ యాదవ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కోర్సుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అగ్రికల్చర్ బీఎస్సీ కోర్సుకు డిమాండ్ ఉందని, తమ యూనివర్సిటీలో వంద శాతం రుణ సదుపాయంతో కోర్సు చేసేందుకు అవకాశం ఉందన్నారు. ఎంపీసీ, బైపీసీ చేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. భారత ప్రభుత్వ ఐకార్ ఆమోదిత కళాశాలలో నాలుగేండ్ల ఈ కోర్సును పూర్తి చేస్తే వ్యవసాయ శాఖ, ఆ రంగంలో మెరుగైన అవకాశాలు ఉన్నాయన్నారు.




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సాంబశివ యాదవ్, మురళీ రెడ్డి తదితరులు